# వాసకసజ్జిక

"శాంతీ! నీ కోసం ఎవరో వచ్చారమ్మా" అంటూ అమ్మ కంఠం బయట సావిట్లోంచి వినిపించింది.

వెంకటేశ్వరస్వామి పటం దగ్గర నిలబడ్డ శాంత ఒక్కసారి ఉలిక్కిపడి, 'వస్తున్నా' అని సమాధానం చెప్పింది కానీ అక్కడ నుంచి కదల్లేదు.

'తన కోసం ఎవరో వచ్చారు' ఇవే మాటలు మనస్సున ఆలాపనగా మసలాయి. ఆనందంతో హృదయం వెఱ్ఱి పరుగులు తీసింది.

నిజానికి అమ్మ ఎంతో అమాయకురాలు. ఆవిడ మాటలు ఎప్పుడూ ఇలాగే ఉంటాయి. తన మనస్సును దోచిన మొనగాడు యీనాడు తమ యింటికి వస్తే అమ్మ అజ్ఞానంగా.....

"నీ కోసం ఎవరో వచ్చారమ్మా!" అని అంటుంది కాని, అమ్మ మాట నిజమే. తన మనసులోని మాట అమ్మకు ఏనాడూ చెప్పలేదుగా.

తన మాట మన్నించి అతను వచ్చాడు. అదేచాలు పది వేలు! ఇంతకన్నా తనకేం అక్కర్లేదు.

"శాంతా" అంటూ అమ్మ కంఠం యింకొకసారి పలికింది. ఈసారి శాంత బదులు పలకలేదు. అద్దానికి రవ్వంత దగ్గరగా వెళ్ళి నిలబడింది. ప్రొద్దున్నే తలంటి పోసుకుందేమో ముంగురులు గాలికి రెపరెపలాడుతున్నాయి. బంగారుఛాయ మొఖం చామంతి వన్నెకు వచ్చింది. ఎఱ్ఱరంగు బార్డరు తెల్లసిల్క్ చీర వంటిపసిమికి తానుకూడా రవ్వంత పసిమి పొందింది. చక్కటి ముఖం, ఎఱ్ఱటి పెదిమలు, ఎంత అందంగా ఉంది!

ఆ మనిషి తనేనని తెలియగానే ఎంత గర్వం కలిగింది!

పారాణి పాదాలమీద నీరెండ దోబూచులాడింది. శాంత అందగత్తె.

'శాంత కాలేజీ బ్యూటీ' అని తనకు వినపడేలాగా అందరూ అంటూ ఉంటారు. ఆ మాటలు వింటూ వుంటే తనకు భూమ్మీద పాదం నిలవదు.

మనస్సు మల్లె కన్నా తేలిక అవుతుంది.

అడ్రసు చెప్పని అజ్ఞాత ప్రియుడు ఒకడు తనమీద పెద్ద పాట రాసి పంపించాడు.

చిన్నారీ నీ సొగసే
వెన్నెలల్లిన చాందినీ
వయ్యారీ నీ వలపే
మరుమల్లెలు విరబూసిన
ఘుమఘుమ పందిరి!!

వెన్నెలల్లిన చాందిని! ఎంత చక్కటి ప్రయోగం. తెలుగు భాషను యింత మధురంగా వాడిన ఆ చిన్నవాడెవరో చూద్దామని కనపడితే, పరిచయం కలిగితే అతనిని అభినందిద్దామని అనుకుంది.

ఇంకొక అనామకుడు తనకు ఉత్తరం రాస్తూ 'రాగమయీ! అనురాగమయీ!' అంటూ సంబోధించాడు. తరువాత సాహిత్యం సెన్సార్ వాళ్ళు కూడా చదవటానికి వీలులేనంత భయంకరంగా రాశాడు.

ఎవరై వుంటారని తన క్లాసులోని మగ పురుగులని అందరిని ఆనాడు పరకాయించి చూసింది.

ఇంకొక విరహ ప్రియుడు. నిండు పున్నమినాడు తనకు అందేలాగా సెంటు వాసనల ఉత్తరం రాశాడు.

బహుశః స్పెషల్ తెలుగు కుర్రవాడేమో.

శుభవోలే సుహాసిని
మధువోలే విలాసిని
కుహూః కమిలి
సరసం సరాగమే
రావే వరాల బాల!

అతగాడి గోత్రనామాలు ఈనాటికి తనకు తెలియవు.

నిజమే! అందరికీ తనను చూస్తే ఆనందమే. అనురాగమే. కాని ఎందరు మెచ్చితే మాత్రం ఏం లాభం, ఆ ఋష్యశృంగుడు కన్నెత్తి చూస్తేనా! ఒక విధంగా అల్లసాని పెద్దన గారి ప్రవరుడు.

"ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ" అంటూ అడ్రసడిగాడు. కొందరు ఎందుకు పుడతారో తనకు తెలియదు. అసలే అర్థం కాదు. కనీసం వాళ్ళకైనా తెలుసో తెలియదో! తెలుసో తెలియదో!!

ఈ కుర్రవాళ్ళ మాటకేం శతమర్కటాలు. కొంతమంది లెక్చరర్లకి కూడా తనని నమిలి మింగేద్దామన్నంత ఆవేశం, ఆకలీ.

వాళ్ళ వెకిలి చేష్టలు చూస్తూంటే ఈ బ్రహ్మదేవుడు ఈ మగజాతిని ఎందుకు పుట్టిస్తాడో కదా అనిపించింది. ఇటువంటి పొరపాటు పని చేశాడు కాబట్టే అలా పూజా పునస్కారాలు లేకుండా మూలపడిపోయాడు.

ఎవరేమనుకుంటే తనకేం! ఏడ్చేవాళ్ళని ఏడవనీ! నవ్వేవాళ్ళని నవ్వనీ!

అతను వచ్చాడు! తను పిలవగానే వచ్చాడు.

అమ్మ నిన్ననే అన్నది. "మా చిట్టితల్లికి రేపటితో పద్దెనిమిది నిండుతాయి.' ఈ రోజు పొద్దుట కూడా ఆ మాటే అన్నది.

తనకి పెద్ద పెట్టున నవ్వు వచ్చింది.

"ఈ మాటే రెండేళ్ళనుండీ అంటున్నావమ్మా" అని తను అన్నది.

"ఎన్ని సంవత్సరాలైనా నువ్వు నా కంటికి పసిపిల్లలాగానే కనిపిస్తావు" అని అమ్మ అన్నది.

"అదే నీతో వచ్చిన చిక్కు" అని తను అన్నది.

"నిన్ను ఒక అయ్య చేతిలో పెడితేనే గాని నా చిక్కు నీకు తీరదు" అని అమ్మ నవ్వుతూ అన్నది.

తనేం మాట్లాడలేదు. అయినా ఏం మాట్లాడుతుంది. తన మనస్సులో నిలచిన ఆ మన్మథమూర్తి ముందరే తను మోకరిల్లాలి. ఛీ! ఛీ! ఇవాళ యిటువంటి ఆలోచనలు వస్తున్నాయేంటి? ఏం? ప్రేమించడం తప్పా?

ఐనా కొందరి తత్వం తనకు ఎంతమాత్రం అర్థం కాదు. అంత మంచివాడు, అందరిచేత ఔననిపించుకోగల ఆ వ్యక్తికి ఆ రౌడీవెధవ ఆ గోపాలం గాడితో స్నేహం ఏమిటో! మిడిగుడ్లు, బుర్రమీసాలూ వాడూను. కసాయి వాడిలాగా కనిపిస్తాడు. అన్నిటికంటే తనకు ఒళ్లుమండేది వాడి వెధవ యికిలింపు.

అమ్మాయిలకి వాడంటే అసహ్యం, లెక్చరర్లకి వాడంటే భయం. తన విషయంలో మాత్రం జాగ్రత్తగానే వుంటాడు. ఎప్పుడూ అమర్యాదగా ప్రవర్తించలేదు కాని...

చంద్రం చుట్టూ ఎప్పుడూ రాహువులాగా వదలకుండా తిరుగుతూ వుంటాడు. చంద్రంతో క్షణకాలం ఒంటరిగా మాట్లాడాలంటే తనకు అవకాశం దొరకటం లేదు. నిన్నటికి నిన్న చంద్రం లైబ్రరీలో వుండగా తను వెళ్లింది. రాహువు దగ్గరలేడు కదా, మనస్సు విప్పి రెండు మాటలు మాట్లాడదామని తను చంద్రం బల్ల దగ్గరకు వెళ్ళి కూర్చుంది. చంద్రం తనను చూడగానే ఎన్నడూ చెయ్యని పని చేశాడు. తనవంక చూసి చిరునవ్వు నవ్వాడు.

తను "థ్యాంక్యూ" అన్నది.

అతను "కూర్చోండి" అన్నాడు.

తను కూర్చుంది. "రేపు నా పుట్టినరోజు" అని అన్నది.

అతనేం మాట్లాడలేదు.

"రేపు మా యింట్లో చిన్న పార్టీ యిస్తున్నాను. రేపు మధ్యాహ్నం మీరు మా యింటికి భోజనానికి రావాలి" అని అన్నది.

"రేపు...." అంటూ అతనేదో చెప్పబోయాడు.

"రేపు కాలేజీకి సెలవు కదా! అభ్యంతరం చెప్పకండి" అని అంటూ వుంటే, ఎక్కడి నుండి వచ్చాడో ఏమో మిడిగుడ్లు వేసుకుని ఆ గోపాలం వచ్చాడు. తమ యిద్దరినీ చూడనట్లుగానే బల్ల దగ్గర కూర్చుని ఏదో రాసుకోవడం మొదలు పెట్టాడు. తను అక్కడ యిక ఒక్క క్షణం కూడా నిలబడలేకపోయింది.

"తప్పక వస్తారు కదూ" అని చంద్రంతో అని అక్కడనుంచి వచ్చేసింది.

"శాంతా" అంటూ అమ్మ మళ్లీ పిల్చింది.

అద్దంలో తనను తాను ఇంకొకసారి చూసుకుంది. ఇంటికి రమ్మని అయితే పిలిచింది కాని తీరా అతను ఇచ్చేసరికి చెప్పలేనంత సిగ్గు వేస్తోంది. తనను గురించి అతను ఏమనుకున్నాడో.

ఏమనుకుంటే తనకేం! తను పిలిచింది, అతను వచ్చాడు. అరమరికలు లేకుండా యీనాడు ఎన్నో విషయాలు అతనితో చెప్పాలి. ముఖ్యంగా గోపాలంగాడి స్నేం మానెయ్యమని మరీ మరీ చెప్పాలి.

చావిట్లోకి వచ్చేసరికి అతను సోఫాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. తను గుమ్మంలోనే ఆగిపోయింది. సోపాలో గోపాలం కూర్చుని వున్నాడు. తనకు ఒళ్లు మండిపోయింది.

"ఎందుకు వచ్చారు మా యింటికి?" అని అడిగింది.

గోపాలం ఉలిక్కిపడి యిటువంక చూశాడు.

"హ్యాపీ బర్త్‌డే టూ యూ! ... జన్మదిన శుభాకాంక్షలు" అని అన్నాడు.

"నేను మిమ్మల్ని మా యింటికి రమ్మనమని పిలిచానా?"

"పిలవని పేరంటానికే నేను వచ్చింది."

"మీరు వచ్చింది ఎందుకో నాకు తెలుసుకాని దయచేసి వెళ్ళండి."

అతని ముఖంలో చిరునవ్వు కనిపించింది. "అభ్యాగతః స్వయం విష్ణువు అన్నారు."

"దేవభాషను ఎందుకు పాడుచేస్తారు కాని యిహ వెళ్లిరండి" అంటూ తను వెనక్కి తిరిగింది.

అతనేం మాట్లాడలేదు. "గుడ్ బై" అంటూ వెళ్ళిపోయాడు.

లోపలికి వెళుతూ వుంటే అమ్మ కాఫీ కప్పుతో ఎదురయ్యింది. 'అతనేడీ' అని అడిగింది.

"వెళ్ళగొట్టేసాను" అని శాంత అన్నది.

ఆవిడ ఒక్క క్షణం శాంత వంక చూసింది. "కూర్చో శాంతా! నీతో ఒక మాట చెప్పాలి."

"నీతి చంద్రిక- హితోపదేశం మొదలుపెడతావా?" అని శాంత చిరాకుగా అడిగింది.

"ఎవరు ఏ ఉపదేశం చేసినా నేను వున్నంతకాలమేనమ్మా! ఆ తరువాత నీ అజ ఎవరికి కావాలి?"

"ఎవరికి కావాలో నువ్వే చెప్పు."

"కట్టుకున్నవాడికి కావాలి, కడుపున పుట్టిన వాళ్ళకి కావాలి."

"సోమలింగం" అని శాంత వెటకారంగా అంది.

"ఇప్పుడు నవ్వులాటగానే వుంది శాంతా! రోజులు గడిస్తే నీకే అర్థం అవుతుంది."

"ఏం అర్థమవుతుంది?"

"ఆడదాని అందం చూసి మగవాడు మోహించవచ్చు. కాని ఆడదానిలోని మంచితనాన్ని చూసే అతను పూజించేది."

"నన్నే మగవాడూ పూజించనక్కరలేదు."

"పూజించనక్కరలేదు. పువ్వుల్లోపెట్టి చూసుకోవాలి అనిపిస్తుంది."

"ఇంతకూ ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకో చెప్పు."

"ఏమీలేదు. గుమ్మంలోకి వచ్చిన మనిషిని అలా దులపరించుకొని పంపించి వేశావు. చదువుకున్నదానివి. అన్నీ తెలిసినదానివి. ఇదేమన్నా బావుందా?"

"ఈ మగవాళ్ళ సంగతి నీకు తెలియదమ్మా. మెల్లిగా ఏదో నెపం మీద మనల్ని పలకరించడం, అక్కడనుంచీ కాలేజీలో నానాగోలా. ప్రతివాడూ తనొక రోమియో నని అనుకుంటాడు. వీళ్ళని చూడగానే ఆడపిల్లలు మూర్ఛపోయి వీళ్ళ పాదాల మీద పడతారని వీళ్ళ ఉద్దేశం. అయినా యీ ఆడపిల్లలకు కూడా

బుద్ధిలేదులే. అన్నీ తెలిసే వాళ్ళ వలలో పడటం, అక్కడనుంచీ ఎక్కడలేని విరహ తాపాలు. గరల్స్ వెయిటింగ్ రూమ్‌లో ఒక్క క్షణం కూర్చుంటే యిదే రభస కదా."

"నీ మాటలేం నాకు అర్థం కావటం లేదు."

"అర్థం కావులే."

"మగవాళ్ళంటే అంత కోపం వున్నదానివి ఆ చంద్రం అంటే ఎందుకు అలా విలవిలలాడిపోతావ్."

శాంత ఒక్కసారి గతుక్కుమన్నది.

"చంద్రమా! చంద్రం సంగతి నీకెలా తెలుసు?"

"అర్థరాత్రి పూట కలవరిస్తుంటే తెలియకేం చేస్తుంది."

"కలవరిస్తున్నానా? అన్నీ అబద్ధాలు."

"కలవరించటంలేదు. పోనీ స్మరణ చేస్తున్నావు."

"చంద్రం అందరిలాంటివాడు కాదమ్మా. ఎంతో తెలివికలవాడు. క్లాసులో ఎప్పుడూ ఫస్టేకదా. ఆడపిల్లల వంక కన్నెత్తికూడా చూడడు. పది మాటలు మాట్లాడితే ఒక్కమాట సమాధానం చెప్తాడు."

"అయినా పరాయివాడితో నీకు మాటలేమిటే?" అని అమ్మ అడిగింది.

"నీకు తెలియదమ్మా. చంద్రం పరాయివాడా?"

"పోనీ పరాయివాడు కాకపోతే ఏ రకం చుట్టం?"

"ఇవ్వాళ భోజనానికి వస్తాడు కదా అప్పుడే అడుగుదువు గానీ."

"భోజనానికి పిలిచావా? నాతో చెప్పలేదేం?"

"నీతో ముందుగా చెబితే అనవసరమైన హడావిడీపడి పది రకాల వంటలు చేస్తావని చెప్పలేదు."

"నీ తెలివి తెల్లారినట్టే ఉందిలే" అంటూ అమ్మ లోపలికి వెళ్ళింది.

"శాంతా! శాంతా" అంటూ బయట నుంచి సుగుణ కంఠం వినిపించింది.

క్లాసుమేటు కంఠం వినబడగానే శాంత కంగారుపడుతూ లేచింది. సుగుణ తనతో మాట్లాడుతూ వుండగా చంద్రం వస్తే యింకేమన్నా వుందా? ఇది ఊరూరా చాటించదూ.... ఏదోవిధంగా దీన్ని వెంటనే పంపించివెయ్యాలి. "రా సుగుణా" అంటూ గుమ్మందాకా వచ్చింది.

"నీతో పోట్లాడదామని వచ్చాను. హ్యాపీ బర్త్‌డే" అని అన్నది.

"నీకెట్లా తెలుసు?" అంటూ ఆశ్చర్యంగా అడిగింది.

"ఉదయం ప్రాంతీయ వార్తల్లో చెప్పారుగా?"

"ఏమని?"

"బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం ఈశాన్యదిక్కుగా ప్రయాణం చేస్తోంది. చెదురుమదురు జల్లుల దగ్గరనుంచి భారీ వర్షందాకా కృష్ణా, ఉభయ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పడవచ్చునని, వాన మబ్బు లేని ప్రాంతాలలో గాలి పొడిగా ఉంటుందని, మన వూళ్ళో కుమారి శాంతగారి జన్మదినం ఘనంగా జరుపుకుంటున్నారని..."

"నేనేం ఘనంగా జరుపుకోవటం లేదు."

"ఆ విషయం నాకు తెలుస్తూనే ఉందిలే. గుమ్మంలోనే నుంచోబెట్టి మాట్లాడుతున్నావు. అయినా నాకెందుకులే అమ్మా. పానకంలో పుడకని, చెవులోని జోరీగని, చెప్పులోని రాయిని...."

"ఇంతేనా ఇంకేమన్నా వుందా" అంటూ శాంత చిరాకుగా "లోపలకి రా" అంది.

"ఇప్పుడు కాదులే. సాయంకాలం వస్తాను. సినిమాకు వెడదాం రెడీగా వుండు. ఈలోగా ఈనాటి ముఖ్యఅతిథి సేవాసత్కారం యథావిధిగా జరుపుకో.'

"ముఖ్య అతిథా? అయనెవరు?"

"దొంగ దొరికింది. అతిథి 'ఆయన' అని తేలింది" అంటూ సుగుణ పెద్దపెట్టున నవ్వింది.

"ఎవరే వచ్చింది" అంటూ శాంతా వాళ్ళ అమ్మ బయటికి వచ్చింది. సుగుణని చూడగానే సంతోషంతో "ఏమే అమ్మడూ బొత్తిగా నల్లపూసైపోయావు. ఇటుకేసి రావడమే మానేశావు. ఈపూట అమ్మాయి పుట్టినరోజు. మన ఇంట్లో భోజనం చేసి వెళ్ళు" అని ఆహ్వానించింది.

శాంత ఏం మాట్లాడలేదు.

సుగుణ పెద్దపెట్టున నవ్వింది. "చెలుల స్నేహం శోభనం దాకా! ఇంకోసారి వస్తాలెండి పిన్నిగారూ! వస్తా శాంతా, సాయంత్రం రెడీగా వుండు."

"రెడీగానే వుంటాగాని నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు."

"చిక్కుప్రశ్నకు సమాధానం వచ్చేవారం సంచికలో చదవండి. పంచరంగుల టైటిల్ పేజీతో 64 పేజీలు. వెల ఒక రూపాయి మాత్రం. టాటా! బైబై!" అంటూ సుగుణ వెళ్ళిపోయింది.

అమ్మ వంటింట్లోకి వెళ్ళింది.

ఒంటరిగా శాంత - శాంతకు తోడుగా చిక్కు ప్రశ్న మిగిలింది.

సుగుణకి యీ విషయం ఎలా తెలిసింది? చంద్రం చెప్పాడా? గోపాలం చెప్పాడా? తను ఎంతో రహస్యంగా వుంచుదామనుకున్న విషయం ఎంత బట్టబయలు అయింది. ఇంకేముంది రేపు యీ పాటికి కాలేజీ గోడల నిండా తాటికాయంత అక్షరాలతో రాయరు?

"శాంత యింటికి చంద్రాన్ని భోజనానికే పిలిచిందా?"

ఛీ! ఛీ! ఏం మనుష్యులు! ఏం లోకం? వీళ్ళని చూస్తే ఎంత అసహ్యం వేస్తుంది! బొత్తిగా ఓర్వలేని మనుష్యులు... ఇప్పుడేం చెయ్యడం...

"అమ్మాయి! అతను అచ్చాడా" అంటూ అమ్మ వచ్చింది.

గుమ్మం వంక చూస్తూ "వస్తూ వుంటాడమ్మా!" అని శాంత సమాధానం చెప్పింది.

గంట గంటకు అమ్మ ఆ ప్రశ్న వేస్తూనే వుంది. శాంత అదే సమాధానం చెబుతూనే వుంది.

చివరకు చల్లారిన ఉత్సాహంతో, చల్లారిన వంటకాలు ఆ తల్లీ కూతుళ్ళు ఇద్దరూ ఇద్దరూ ఎంగిలిపడి లేచారు.

ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. చంద్రం ఎందుకు రాలేదు? తన పిలుపు నచ్చలేదా? రావడానికి మొహమాటపడ్డారా? వస్తూంటే యాక్సిడెంట్ జరిగిందా!! అమ్మో, చంద్రానికి ఏం అపాయం అపాయం జరగకూడదు. చల్లగా వుండాలి. క్షణకాలంలోనే వెయ్యి దేముళ్ళకు మొక్కుకుంది.

ఛీ! ప్రొద్దున్నే లేచి ఎవరి ముఖం చూశానో! అన్నీ యిల్లాగే అవుతున్నాయి... పిలవని పేరంటంగా వచ్చాడుగా ఆ గోపాలం! వాడి ముఖం చూశాను. అన్నీ నాశనం అయ్యాయి....

కాలు కాలిన పిల్లిలాగా యిల్లంతా తిరుగుతూనే వుంది.

సాయంకాలం అయ్యింది. చీకటి వచ్చింది. కాని చందమామే రాలేదు. చందమామ రాలేదు. కాని సుగుణ వచ్చింది.

"రాణీగారు యింకా యిల్లాగే వున్నారేం? అతిథి సత్కారంలో బాగా అలసిపోయినట్టు వున్నారే?" అని అంది.

"నోరు మూసుకో" అని శాంత అంది.

"నోరు మూసుకునే పడివుంటాగాని అమ్మాయిగారు త్వరగా తెమలండి. అవతల కాలం మనకోసం ఆగటం లేదు."

"నేను రాలేనే."

"నువ్వు రాకుండా నేను వెళ్ళలేనే పిచ్చితల్లీ. ప్లీజ్ గెట్ రెడీ."

"వస్తాను గానీ, నో క్వశ్చన్స్, ప్రశ్నలు వేసి నా ప్రాణం తియ్యద్దు."

"ఓకే. నో క్వశ్చన్స్. ప్రశ్నలడగనులే. త్వరగా తెములు."

వీళ్ళు వెళ్ళేసరికే సినిమా ప్రారంభమయ్యింది. చీకట్లోకి వెళ్ళి ఒక మూల కూర్చున్నారు. సుగుణ సినిమాలో లీనమై చూస్తోంది. తెరమీద ఈస్టమన్‌కలర్‌లో నాయికా నాయకులు యిద్దరూ డ్రీమ్ సీన్‌లో ఒకళ్ళకొకళ్ళు హత్తుకొని 'క్షణక్షణం నిరీక్షణం' అంటూ తన్మయం అవుతున్నారు.

శాంత మనస్సులో మసలుతున్న ప్రశ్న చంద్రం ఎందుకు రాలేదు?

కథానాయికా నాయకుల కల కరిగించివేస్తూ రంగంలోకి విలన్ ప్రవేశం. కొంచెం సేపు 'డిష్కుం డిష్కుం' అంటూ శబ్దాలు. భయంకరమైన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌తో డస్సిపోయిన ప్రేక్షకులకి విశ్రాంతి అవసరమని తెరమీద మూడు పెద్ద పెద్ద అక్షరాలు కనిపించాయి 'విశ్రాంతి' అని. చీకటి పోయి వెలుగు వచ్చింది. కాని ఆ వెలుగులో శాంత కళ్ళముందు ఇంకా పెద్ద చీకటి కమ్ముకుంది.

రెండు వరసల ముందరగా వాళ్ళు ముగ్గురు కనిపించారు.

చంద్రం, ఒక చామనచాయ పిల్ల, ప్రక్కన గోపాలం!

చంద్రం ఆ పిల్లతో ఏమిటో చెపుతున్నాడు. ఆ పిల్ల ఆసక్తిగా వింటోంది.

సుగుణ అటువైపే చూసి, శాంత ముఖం వంక చూసింది.

"చంద్రం మధ్యాహ్నం భోజనానికి రాలేదా" అని అడిగింది.

శాంత సమాధానం చెప్పలేదు. "నేను యింటికి వెళుతున్నాను" అంటూ లేచింది.

"నేను కూడా వస్తున్నా" అంటూ సుగుణ కూడా బయలుదేరింది.

దారి పొడుగునా యిద్దరూ ఏం మాట్లాడుకోలేదు. శాంతని యింటిదగ్గర దిగబెట్టి సుగుణ వెళ్ళిపోయింది.

"అప్పుడే వచ్చేశావేం" అంటూ అమ్మ అడిగింది.

హేండ్‌బాగ్ సోఫాలోకి విసిరికొట్టి శాంత కూలబడింది.

"కాఫీ తెచ్చిపెట్టమ్మా" అని మాత్రం అంది. సోఫాలోంచి కిందపడ్డ హేండ్‌బాగ్ తీసుకుందామని కిందకు వంగింది. సోఫాకి, టీపాయ్‌కి మధ్య ఒక చిన్న గిఫ్ట్ ప్యాకెట్ పడివుంది. దానిమీద 'కుమారి శాంతకు జన్మదిన కానుక' అని

రాసి వుంది. వణుకుతున్న చేతులతో ఆ ప్యాకెట్ విప్పింది. ఉలిపిరి కాయితంతో పొట్లంలో నల్లటి వెల్వెట్ మీద పింఛం విప్పుకున్న నెమలి వెండి జరీ పని చేసిన హేండ్ బ్యాగ్. హేండ్ బ్యాగ్ తెరిచింది. మడతపెట్టిన కాగితం వుంది. చివర సంతకం చూసింది. 'చంద్రం' అని వుంది.

చంద్రం! చంద్రం!! చంద్రం!!!

మరి సినిమాలో ఆ అమ్మాయి ఎవరో? ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు, సందేహాలు మనస్సులో పెట్టుకుని వుత్తరం చదవటం మొదలుపెట్టింది.

"కుమారి శాంతగారికి,

నమస్కారములు. మీ జన్మదిన శుభసమయాన నా తరపున, మన మిత్రులందరి తరపున మీకు మా శుభాకాంక్షలు తెలియపరుస్తున్నాను.

మీ యింటికి విందుకు పిలిచారు. వద్దామనే అనుకున్నాను. కాని నన్ను ఒక్కడినే పిలిచారని తెలిసిన తరువాత నా నిర్ణయం మార్చుకున్నాను.

కారణం చెప్పవలసిన బాధ్యత నాకుంది. లేకపోతే మీరు నన్ను అపార్థం చేసుకోవచ్చు.

నిజం చెప్పాలంటే కారణాలు...

ఒకటి- మా ఆవిడ యీనాడు ఊరునుంచి వచ్చింది.

రెండు- నేను ఒంటరిగా పెళ్ళికాని ఆడపిల్లల యింటికి భోజనానికి వెళ్ళడం తనకు నచ్చదు.

మూడు- తనకు నచ్చని పని ఏదీ నేను చెయ్యను.

అందుకని విందుకు రానందుకు క్షమార్పణలు చెప్పుకుంటూ యీ చిన్న కానుక మా బావమరిది గోపాలం ద్వారా పంపిస్తున్నాను. దయతో స్వీకరించండి. వెయ్యికాలాలపాటు సుఖంగా వుండండి. గుడ్‌లక్.

- చంద్రం.

కథా నిలయం
5683
శ్రీకాకుళం